క్లుప్తంగా

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



రైతులతో మాట్లాడుతున్న రవిశంకర్

గంగాధర: రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. బుధవారం మండలంలోని కురిక్యాల సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరగా వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. యూరియా కొరత ఉందని ఆధార్‌కార్డుకు బస్తా ఇస్తున్నారని రైతులు ఆయనతో మొర పెట్టుకున్నారు. స్పందించిన రవిశంకర్ కలెక్టర్‌తో మాట్లాడారు. రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను వివరించడంతో సత్వర చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతుబంధు అందలేదు, కనీసం అవసరం మేరకు యూరియా సరఫరా చేయడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో యూరియా కొరత రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించమని హెచ్చరించారు.

విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే చర్యలు



విచారణ చేస్తున్న సీఐ వెంకటి

శంకరపట్నం: వినాయక విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి హెచ్చరించారు. మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని బీసీ కాలనీ(కిష్కింధపల్లె)లో 25 ఏళ్లుగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకుంటున్నామని, ఐలయ్య అనే వ్యక్తి అడ్డుకుంటున్నారని కేశవపట్నం పోలీసులు, అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సమస్యను విన్నవించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సై శేఖర్‌రెడ్డికి సూచించారు. ఈమేరకు సీఐ వెంకటి, ఎస్సై శేఖర్‌రెడ్డి కాలనీలో విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా గేటు ఏర్పాటు చేయొద్దని ఐలయ్యకు సూచించారు. వినాయక మండపం వద్ద న్యూసెన్స్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

నానో యూరియాతో అధిక లాభాలు



నానో యూరియా గురించి వివరిస్తున్న ఏడీఏ

హుజూరాబాద్‌రూరల్: నానో యూరియాతో రైతులకు అధిక లాభాలు ఉంటాయని ఏడీఏ సునీత అన్నారు. బుధవారం మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో వెంకటరామిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. యూరియా బస్తాలు వాడిన పొలాలు, నానో యూరియా వాడిన పొలాల మధ్య వ్యత్యాసాన్ని పరిశీలించారు. నానో యూరియా బాటిల్ ఒక బస్తా యూరియాకు సమానమని, నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఇఫ్కో రాష్ట్ర మేనేజర్ హరికృపాశంకర్, ఏఓలు భూమిరెడ్డి, ఖాదర్ హుస్సేన్, ఎఫ్‌బీవో అధ్యక్షులు పరమేశ్వర్, ఇఫ్కో జిల్లా అధికారి బాలాజి పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

జమ్మికుంట: మున్సిపల్‌లో పనిచేసిన బిల్ కలెక్టర్ పూలాల కుమారస్వామి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ రూ.పది లక్షల చెక్కును మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మృతిడి భార్య సుమలతకు బుధవారం అందజేశారు. బీమా మృతుడి కుటుంబానికి ఆర్థికంగా ఎంతో అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ టెరిటరీ మేనేజర్ భీమని రమేశ్‌బాబు, జడల చిరంజీవి, భోగోజు అనిల్‌కుమార్, మేకల వేణుగోపాల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన యువకుడు తాండ్ర శ్రీహాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు చల్లూరు పోస్టాఫీస్‌లో ప్రమాదబీమా చేసుకోగా పెద్దపల్లి పోస్టల్ మేనేజర్ రాజేశ్, జమ్మికుంట పోస్టల్ ఇన్స్పెక్టర్ మోహన్ బుధవారం రూ.పది లక్షల చెక్కును శ్రీహాస్ కుటుంబానికి అందించారు. ఈ నెల 31వరకు పోస్టల్ కార్యాలయాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని, బీమా చేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 65 ఏళ్లలోపు వారు అర్హులని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాండ్ర శంకర్, నాయకులు రమేశ్, ఆదిరెడ్డి, ఎనగంటి శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రమాదకర కల్వర్టుతో ఇబ్బందులు



వీణవంక: మండలంలోని బేతిగల్ శివారు ఊర చెరువు మత్తడి వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. రెండేళ్లుగా కల్వర్టుపై ఉన్న గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు చేరింది. దీంతో కరీంనగర్ నుంచి లోడ్‌తో వస్తున్న ట్రాలీ ఆటో గుంతలో దిగపడిపోయింది. రెండు గంటలపాటు శ్రమించిడంతో ఆటో బయటకు వచ్చింది. అదే విధంగా మానకొండూరుకు చెందిన ఓ కారు కల్వర్టు వద్ద ఉన్న గుంతలో దిగబడటంతో ముందు భాగం ధ్వంసమైంది. కరీంనగర్ నుంచి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గుంత వద్ద అదుపు తప్పి పడటంతో గాయాలపాలయ్యాడు. ఒక్క రోజే మూడు ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జీపీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం: మండంలోని గొల్లపల్లి గ్రామంలో నూతన జీపీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఆరు నెలల్లో భవనం నిర్మించిన ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డిని అభినందించారు. అనంతరం కేశవపట్నం రైతువేదికలో కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఏవో వెంకటేశ్, ఎంపీవో ప్రభాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు బస్వయ్య, మహిళా అధ్యక్షురాలు పద్మ, నాయకులు, పాల్గొన్నారు. కేశవపట్నం రైతువేదికలో చెక్కుల పంపిణీ చేసి వెళ్తుండగా కేశవపట్నం గ్రామ పంచాయతీ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించండని వేడుకోగా మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మాధవిలత



శంకరపట్నం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవిలత ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాధవిలత మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాల బారినపడి విద్యార్థులు జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ సేవించినా, విక్రయించినా నేరంగా పరిగణిస్తామని, పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి అమ్మకాలు సాగిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పెద్దన్న, ఎండీ ఫయాజుద్దీన్, శైలజ, ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

గంగాధర: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ బారినపడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని ఎస్సై వంశీకృష్ణ అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక హానికర ప్ర భావాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



గంగాధర: మాట్లాడుతున్న ఎస్సై వంశీకృష్ణ

మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

శంకరపట్నం: మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం కేశవపట్నంలో ఎస్సై శేఖర్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టిపెట్టాలని, మత్తుపదార్థాల బారినపడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మల్లారెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ ఎండీఅయాజ్ ,తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో తడి, పొడిచెత్త సేకరణ, వేరు చేయు విధానంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వాతావరణ మార్పులు, చెత్త సేకరణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశలో పరిసరాల శుభ్రతపై అవగాహన ఉంటే మంచి కుటుంబ జీవనం సాధించవచ్చని, అంతేకాకుండా తడి, పొడిచెత్త వేరుచేసి వాహనాలకు అందించడం వంటి విషయాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేయడం వల్ల పట్టణ పరిశుభ్రత మెరుగుపడుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ్యాగ్‌లు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికి పెన్నులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఉపాధ్యాయులు, మున్సిపల్ ఈఈ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన పోటీలు...

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని, పర్యావరణ పరిరక్షణ చర్యలపై వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన



హుజూరాబాద్: పట్టణ శివారులోని నాగార్జున మిల్క్ డెయిరీని బుధవారం కరీంనగర్ కిమ్స్ ఫుడ్ సైన్స్ విద్యార్థులు సందర్శించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా పాలు, పాలపదార్థల తయారీని డెయిరీ ఏజీఎం ఆకునూరి సుధాకర్, మేనేజర్ శ్రీనివాస్ వివరించారని కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ పెరియాల సాకేత్ రామారావు తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్‌రావు, డైరెక్టర్ పుల్లూరి గణేశ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నవభారత్ సాక్షరతా కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో భూపతి శ్రీనివాస్ తెలిపారు. ఆయా గ్రామాల వీవోఏ, ఎస్‌ఎల్‌ఎఫ్, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీఆర్‌పీ తిరుపతి, ఏపీఎం జ్యోతి, సీఎల్ఆర్‌పీ మల్లీశ్వరి, రీసోర్స్ పర్సన్ శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.



మానకొండూర్‌లో శ్రీకృష్ణాష్టమి

ముందస్తు కృష్ణాష్టమి

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం టీచర్లువిద్యార్థులకు పండుగల ప్రాముఖ్యతను వివరించారు.



చొప్పదండిలో...

పొంగి పొర్లుతున్న మోయతుమ్మెద వాగు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి–కోహెడ మధ్య నిర్మించిన కల్వర్టు పైనుంచి మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుందని, కల్వర్టు శిథిలావస్థలో ఉందని, ఎప్పుడు కొట్టుకుపోతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. కల్వర్టు పూర్తిగా ధ్వంసమైందని గతేడాది ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరాన్నారు.

నిల్వ నీటితో ఇబ్బందులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల క్రాసింగ్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో చెంజర్ల, కొండపలకల, గంగిపల్లి, ఎరడపల్లి వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీరు నిల్వకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

విరిగిన లారీ లింక్ రాడ్



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ క్రాస్ వద్ద బుధవారం లారీ లింక్ రాడ్ విరిగిపోవడంతో రోడ్డుపై నిలిచిపోయింది. గ్రానైట్ క్వారీ కోసం లారీలో యంత్రం తరలిస్తుండగా లింక్ రాడ్ విరిగిపోయింది. వరంగల్ వైపు వెళ్లే వాహనాలు రోడ్డుపై రెండు గంటల పాటు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాలీలో యంత్రాన్ని జేసీబీతో కిందికి దించి, ట్రాలీ పక్కకు జరపడంతో ట్రాఫిక్ క్లియరైంది.

ఉపాధ్యాయుల అభినందనలు



పుస్తకాలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్ ఇంగ్లిష్ టీచర్ ఎస్‌డీ ఇర్షాద్ అలీ న్యూఢిల్లీకి చెందిన సీసీఆర్‌టీ నిర్వహించిన ఓరియెంటేషన్ కోర్స్ విజయవంతంగా పూర్తిచేశారని ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ వారు పాఠశాలకు కళలు, సాహిత్యంకు సంబంధించిన పుస్తకాలు, మ్యాగజైన్లను స్కూల్ లైబ్రరీకి అందించారని, శిక్షణ కాలంలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు కృత్యాల రూపంలో చెప్పాలని ఇర్షాద్ అలీకి సూచించారు. ప్రిన్సిపాల్ తో పాటు తోటి ఉపాధ్యాయులు అలీని అభినందించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ షూ



షూ అందజేస్తున్న పూదరి తిరుపతి, వెంకటేశం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పూదరి తిరుపతి, వెంకటేశం స్పోర్ట్స్ షూ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కన్నం రమేశ్, పీడీ దత్తాత్రి, గాదె నర్సయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 3న మహాగర్జన

శంకరపట్నం: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3న దివ్యాంగుల పింఛన్ పెంపుపై నిర్వహించే మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు కోరారు. కేశవపట్నంలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మదునయ్య, సమ్మయ్య, కుమార్, చంద్రమౌళి, లింగస్వామి, నరేశ్,రాకేశ్, అనిరుద్‌లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జమ్మికుంట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను టౌన్ సీఐ రామకృష్ణ బుధవారం బాధితుడికి అందజేశారు. పట్టణానికి చెందిన సాదిక్ అలీ జమ్మికుంటలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

కేసు నమోదు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మికి చెందిన ట్రాక్టర్‌ను లీజుకు తీసుకొని విక్రయించిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. లక్ష్మి ఆమె భర్త తిరుపతి ట్రాక్టర్ కిరాయిలతో జీవనం సాగిస్తున్నారు. తిరుపతి చెంజర్లకు చెందిన రవీందర్ వద్ద రూ.నలభై వేలు అప్పుగా తీసుకున్నాడు. కొన్ని రోజులకు రూ.పదివేలు రవీందర్‌కు ఇవ్వగా మిగతా డబ్బులకు ఆలస్యమైంది. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను లీజుకు ఇవ్వాలని కోరగా రవీందర్‌కు లీజుకు ఇచ్చాడు. తిరుపతి కుటుంబ సభ్యులకు తెలియకుండా ట్రాక్టర్‌ను వేరే వ్యక్తులకు విక్రయించాడు. అనుమానం వచ్చిన తిరుపతి నిలదీశాడు. కాగా చెంజర్లకు చెందిన పలువురు బెదిరిస్తున్నారని తిరుపతి భార్య ఫిర్యాదు తో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

స్పందన



ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయబావితో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించారు. బుధవారం బావిచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



గన్నేరువరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



జమ్మికుంటలో బైక్ ర్యాలీ

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

జమ్మికుంట: బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతి పౌరుడు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, రాజేశ్‌ఠాకూర్, గూడురి శ్రీనివాస్, పల్లపు రవి, కైలాసకోటి గణేష్, అప్పం మధు, ఇటుకాల స్వరూప, బచ్చు శివన్న, మోడం రాజు, రాకేష్ ఠాగూర్, రాము, రవి, సమ్మయ్య, శరత్, మహేష్, పోచయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతీ ఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ అన్నారు. బుధవారం మండలకేంద్రం గన్నేరువరంలో వంద మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయాలని, ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణంగా నిలిచిందని, త్రివిధ దళాలను ప్రశంసిస్తూ, వీరుల త్యాగాలను గుర్తిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో విలాసాగరం రామచంద్రం, ఏలేటి చంద్రారెడ్డి, తిరుపతి, రామచంద్రం, రాము, కుమార్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, గణేశ్, స్వామిరెడ్డి, రాజిరెడ్డి, హరీశ్, గౌతమ్, అజయ్‌రెడ్డి, రాజమల్లు, జగన్, రవి, కుమార్, శ్రీను, ప్రశాంత్, మల్లేశం, శేఖర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: ప్రచారం చేస్తున్న నాయకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్ట రవీందర్, కోటగిరి ప్రశాంత్, ఒరుగంటి మహేశ్, కట్ట పురుషోత్తంచారి, కోటగిరి రవీంద్రాచారి, వీరయ్య, కొంరయ్య, శేఖర్, సబ్బయ్య, రఘు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

చదువుపై దృష్టి పెడితేనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న సెక్రటరీ సతీశ్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుపై దృష్టి పెడితే బంగారు భవిష్యత్ ఉంటుందని కిట్స్ కళాశాల సెక్రటరీ వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన ప్రథమ సంవత్సర విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలలో చేరినప్పటి నుంచి లక్ష్యం వైపుగా విద్యార్థులు అడుగులు వేయాలని, ఇంజినీరింగ్‌లో విద్యార్థికి ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. సమాజానికి, విద్యార్థికి ఒక సంబంధం ఏర్పడుతుందని, కళాశాలలో సకల సదుపాయాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త స్కిల్స్ నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ఇంద్రనీల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రబాబు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మేకల అపహరణ

హుజూరాబాద్‌రూరల్: రాంపూర్‌లో మేకలు అపహరణకు గురైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సుంకరి ఓదేలుకు చెందిన నాలుగు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి తీసుకువెళ్లారని, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దీక్ష విరమించిన హిమ్మత్‌నగర్ గ్రామస్తులు

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో 34 రోజులుగా చేస్తున్న నిరసన దీక్ష బుధవారం విరమించారు. ఇసుక లారీలపై టాటిపత్రులు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ గ్రామస్తులు దీక్ష చేపట్టారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మరోసారి గ్రామస్తులతో చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, వినాయక చవితి నేపథ్యంలో దీక్ష విరమించాలని కోరారు. వెంట సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఆవుల తిరుపతి ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

వీణవంక మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలని హుజూరాబాద్ ఏసీపీ మాధవి ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఏసీపీ మాధవి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.

కేశవపట్నం పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పీహెచ్‌సీలో బుధవారం సాధారణ ప్రసవం చేశామని వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆముదాలపల్లె గ్రామానికి చెందిన మహిళకు పురిటినొప్పులు రావడంతో కేశవపట్నం పీహెచ్‌సీకి తీసుకురాగా రెండు కాన్పులో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. ఇప్పటి వరకు ఎనిమిది సాధారణ ప్రసవాలు చేశామన్నారు.